ఆదివారం

ప్రజాశక్తి

ఫిబ్రవరి 10, 2002

లోపలిపేజీలో

హ్యాపీ బర్త్‌డే



భావిగతిని సూచించే అసెంబ్లీ ఎన్నికలు

SRI SAI KIDNEY CENTRE

INSTITUTE OF UROLOGY

7-1-59/4/8, Near Lal Bunglaw, Ameerpet, Hyd-16.

Ph: 3756789, 3756644, 6639649, 6639659. e-mail : srisai@kidneyap.com, website : www.kidneyap.com

Specialities...

❑ Urology ❑ Nephrology ❑ Gastro Enterology ❑ Surgical Gastroenterology & Laproscopic Surgery ❑ Cardiology ❑ Gen. Surgery ❑ Gen. Medicine ❑ Orthopaedics ❑ Gynaecology & Obstetstrics ❑ Paediatrics ❑ Psychiatry

Services Available.....

❑ Haemo-Dialysis ❑ Kidney Transplantation ❑ Extra Corporeal Shock Wave Lithotripsy (ESWL) ❑ Well Equipped Operation Theatres ❑ Well Equipped ❑ ICU with ventilator ❑ Endo Urology PNCL, URSL, TURP Etc., ❑ Laparoscopic Urology and Surgery ❑ Paediatric Reconstructive Urology ❑ Urodynamic Lab ❑ Infertility & Impotence evaluation ❑ Colour Doppler & 2D Echo ❑ Transrectal Ultrasound ❑ 24 hours clinical lab & 300 ma X Ray.

Endo Urology Theatre.....

Advantages:

❑ No incision required. Short hospital stay. Safe. ❑ In combination with ESWL almost 100% stone removal without surgery ❑ Early resumption of work and cost Effective.

Endo Urology Procedures We Perform .....

❑ Urethrotomy, TUR (P) ❑ Fulguration of Urethrel valves (TUF) ❑ BNI (Bladder Neck Incision) ❑ TUR (BT), Deroofing of Ureterocele ❑ PCCL (Per Cutaneous Cysto Lithotripsy for Paediatric Bladder Stones) ❑ Uretero renoscopy for stones and strictures of Ureter (URS) ❑ Endo Pyelotomy ❑ PCN PCNL and many other Endo Urology Procedures.

Laparscopic Procedures we Do.....

❑ Laparoscopic Nephrectomy ❑ Lap Pyeloplasty ❑ Lap Deroofing of renal cysts ❑ Lap Uretaro Lithotomy ❑ Lap Varicocele Ligation ❑ Lap Orchinpexy/Orchiectomy ❑ Lap Excision of Bladder Diverticulum ❑ Lap Prostatectomy and many other lap Urology procedures.

NB : All kinds of surgical Gastroenterological Laparoscopic Procedures are done by experinced Surgical Gastroenterologists.

Dr. B. Sambasiva Rao
Chief Urologist & Managing Director
Cell No. 98480-15451

A Clean and Aesthetic Environment....



Haemodialysis | ESWL Theropy | Air conditioned O.T. | Urodynamic LAB | Philips C-ARM | Laparoscopy Unit | Advanced Lithoripsy

High - technology treatment Gadgetry....



రక్తాన్ని పీల్చుతున్న డెంగ్యూ దోమ

మార్గం లేదు.

ఈ దోమలు ఎక్కడ నివసిస్తాయి?

ఈ దోమలు యిళ్ళలోనూ, మదుగున్న ప్రాంతాలలోనూ, ఇతర చీకటి ప్రదేశాలలోనూ విశ్రాంతి తీసుకుంటాయి. ఆరుబయట అయితే చల్లని ప్రదేశాలలోనూ, నీడగా వుండేచోట నివసిస్తాయి. ఆడదోమలు యిళ్ళు, పాఠశాలల చుట్టుపక్కల, పట్టణాలు లేదా పల్లెల్లోని యితర ప్రదేశాలలో గుడ్లు పెడతాయి. ఈ గుడ్లు పదిరోజుల్లో పిల్లలుగా మారతాయి.

దోమలు ఎక్కడ గుడ్లు పెడతాయి?

డెంగ్యూ దోమలు నీరు నిల్వవుంచిన ప్రదేశాలలోనూ, నీటి వ్యవస్థలలోనూ గుడ్లు పెడతాయి. నీటి పీపాలు, డబ్బాలు, కూజాలు, కుండలు, బక్కెట్లు, పూల కుండీలు, మొక్కల కుండీలు, చెరువులు, పారవేసిన సీసాలు, డబ్బాలు, టైర్లు, వాటర్ కూలర్లు, యింకా వర్షపునీరు నిల్వ వుండే ప్రదేశాలు ఇవి గుడ్లు పెట్టడానికి అనువైన ప్రదేశాలు.

డెంగ్యూ దోమకాటు నివారణ

డెంగ్యూ దోమలు పగటిపూట కుడతాయి. వీటి కాటునుంచి జాగ్రత్తలు తీసుకోవాలి. కాళ్లు, చేతులను కప్పివుంచేలా నిండుగా లేదా పొడవుగా వుండే బట్టలను ధరించండి. రిపెల్లెంట్లను ఉపయోగించండి. పగటిపూట దోమలను పారదోలే కాయిల్స్, ఎలక్ట్రిక్ వేపర్ మ్యాట్లను ఉపయోగించండి. నీటిని నిల్వ వుంచిన ప్రదేశాలలో దోమలు గుడ్లు పెట్టడానికి అనువుగా లేకుండా జాగ్రత్తలు తీసుకోండి. వర్షపు నీరు నిల్వ వుండకుండా యింటి చుట్టూ వున్న మురికి కాల్వలను శుభ్రం చేయాలి. డెంగ్యూ హెచ్ - జ్వరంతో బాధపడే రోగులను కనీసం ఐదు రోజుల పాటు వేరుగా వుంచాలి. మీ పొరుగున ఎక్కడైనా డెంగ్యూ హెచ్ - జ్వరం వున్నట్లుగా మీ దృష్టికి వస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తెలియజేయండి. దోమ - మనిషి - దోమ అనే చక్రాన్ని వెంటనే భగ్నం చేయాలి. డెంగ్యూతో బాధపడుతున్న రోగిని కుడితే దోమకు ఆ వైరస్ సంక్రమిస్తుంది. అది మరలా ఎవరైనా ఆరోగ్యవంతులను కుడితే వారికి వ్యాధి సంక్రమిస్తుంది. దోమలు రోగులను కుట్టకుండా దోమతెరలు, రిపెల్లెంట్లు సమర్థవంతంగా ఎదుర్కొంటాయి. తద్వారా డెంగ్యూ వ్యాధి విస్తరించకుండా అడ్డుకొనేందుకు వీలు కలుగుతుంది.

(ది వీక్ సౌజన్యంతో)



నా వయస్సు 30. నాలుగేళ్ళుగా జామపండుతిన్నా, ఐస్‌వాటర్ తాగినా, దుమ్ము, ధూళి తగిలినా రాత్రిపూట తుమ్ములు, పిల్లికూతలు వస్తాయి. డాక్టర్ దగ్గరకు వెళితే అవిల్ టాబ్లెట్, ఇంజక్షన్ ఇస్తున్నారు. అప్పటికి రిలీఫ్‌గా వున్నా మూడు రోజుల తర్వాత పరిస్థితి యథాస్థితికి వస్తుంది. తగు పరిష్కారం చెప్పగలరు.

– కె.యు.రమణమూర్తి, రేణిగుంట

మీ సమస్యకు కారణం అలర్జీ. ఇది ఎందుకు వస్తుందనే దానికి చాలా కారణాలు వున్నాయి. నిర్దిష్టమైన క్రిమిగానీ, పదార్థం వల్లగానీ రావచ్చు. అందువల్ల వైద్యం కూడా నిర్దిష్టంగా నిర్ణయించబడలేదు. ఉన్న వైద్య పరిష్కారాలలో

1. డిసెన్సిటిజేషన్: ఈవిధానంలో అనేక పదార్థాలను శరీరంలోనికి ఇంజక్షన్ రూపంలో ఎక్కించి అలర్జీ కారకాన్ని కొనుగొని చిన్న మోతాదులలో రోగి శరీరానికి అనేకమార్లు ఇవ్వటం వలన ఆ పదార్థానికి వ్యతిరేకంగా శరీరంలో నిరోధకశక్తి పెరిగి మళ్ళీ ఆ పదార్థానికి తారసపడినప్పుడు అలర్జీ కలగకుండా ఉంటుంది.
2. ఏపదార్థమైతే పడదో దానిని ఉపసంహరించుకోవాలి.
3. స్టెరాయిడ్ స్ప్రే రోజుకు రెండు సార్లు ముక్కులోకివాడాలి. జీవితాంతం కూడా అవసరాన్ని బట్టి వాడాలి.

నా వయస్సు17 సంవత్సరాలు. నా ముఖం వెడల్పుగా, బుగ్గలు ఎత్తుగా వుంటాయి. అందువల్ల నా ముక్కు చట్టిముక్కు మాదిరి ఉంటుంది. ముక్కు కుట్టించుకుందామన్నా భయం వేస్తోంది. నేను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవాల్సిందేనా!? ఖర్చు, ఇతర వివరాలు తెలుపగలరు.

–కె.లక్ష్మీదేవి, తిరువూరు

చట్టిముక్కు ఉంటే augmentrhinoplasty ద్వారా సరిచేసుకోవచ్చు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ హాస్పటల్‌లో ప్లాస్టిక్ సర్జన్‌ను కలిస్తే మరిన్ని వివరాలు తెలుస్తాయి.

డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు,

ఎంఎస్,డిఎల్ఓ, భారతి నర్సింగ్‌హోం, ఒంగోలు

* * *

నా వయస్సు 19 సంవత్సరాలు. ఒకటిన్నర సంవత్సరం నుండి నాకు నడుములో నొప్పి చాలా వుంది. వెంట్రుకలు రాలి బట్టతల వచ్చింది. జ్ఞాపక శక్తి తగ్గింది. పనిలో అలసటగా వుంది. కళ్ళ కింద నల్లటి మచ్చ ఏర్పడింది. డైజెషన్ ప్రాబ్లమ్ కూడా ఉంది. కోపం కూడా ఎక్కువ ఉంది. ఈ లక్షణాలన్నీ 'ఎయిడ్స్'కు సంబంధించినవా? నేను ఏ డాక్టర్ దగ్గరకు వెళ్ళాలి. ఎంత ఖర్చు అవుతుంది?

– పేరు రాయలేదు

మీరు రాసిన లక్షణాలన్నీ ఎయిడ్స్‌కు సంబంధించినవి కావు. మీకు ఇంకా అనుమానంగా ఉంటే రక్తపరీక్ష చేయించుకొని నిర్ధారణకు రావచ్చు.

నా వయస్సు 23 సంవత్సరాలు. సంవత్సరకాలం నుండి ముఖంపై మొటిమలు ఏర్పడుతున్నాయి. గిల్లితే తర్వాత నల్లని మచ్చ ఏర్పడుతుంది. ఎన్నో క్రీములు వాడినా తగ్గలేదు. సరైన మందు సూచించగలరు.

– ప్రవల్లిక, విశాఖ

మీరు నల్లటి మచ్చలు తగ్గుటకొరకు ఎ-ఆర్ఇటి-హెచ్‌సి క్రీమ్ రోజూ రాత్రి వేళ మచ్చపైకు చాలాతక్కువగా సన్నగచేసిన పుల్లతో పక్క చర్మం తగలకుండా వాడినచో ఫలితం ఉంటుంది.

డాక్టర్ కె.విజయకుమార్‌రాజు, ఎంబిబిఎస్,ఎండి.(డెర్మటాజీ)

చర్మవ్యాధుల నిపుణులు, ఒంగోలు.

* * *

నా పళ్ళు రెండు ఎత్తుగా, వంకరగా ఉంటాయి. ఆపరేషన్ చేస్తే ఎంత ఖర్చు అవుతుంది. ఎక్కడ చేస్తారో తెలియచేయగలరు.

– అశ్విని కుమార్, అవనిగడ్డ

ముఖ్యంగా 25సంవత్సరాలలోపు అయితే ఆర్థోడెంటిక్ ట్రీట్‌మెంట్ ద్వారా సరిచేయవచ్చు. అదే 25సంవత్సరాల కంటే ఎక్కువయితే సర్జరీ ద్వారా సరిచేయాల్సి ఉంటుంది. 25సంవత్సరాల లోపువారు డెంటల్ సర్జన్ చేతగానీ, ఎండిఎస్ ఆర్థోడెంటియా డాక్టర్లతో గానీ చేయించాలి. ఎండిఎస్ ఓరల్ సర్జరీద్వారాకూడా చేయించుకోవచ్చు.

డాక్టర్ పి.బాలబ్రహ్మచారి, బిడిఎస్ (ఓఎస్ఎం).

సందీప్ దంతవైద్యశాల, ఒంగోలు.

అంపశయ్య నవీన్

అపోహలూ, అభూతకల్పనలు

మా పక్కూర్లోనే ఉండే మా బంధువొకాయన ఏదో పెళ్ళి సంబంధం గురించి మా ఆవిడతో మాట్లాడటానికి మా ఇంటికొచ్చాడు. ఆయన పేరు ధర్మయ్య. ఆయనకు యాభయ్యేళ్ళుంటాయి. ఆయనకిద్దరు బిడ్డలు. ఇద్దరు కొడుకులు. పెద్ద కూతురుకు పెళ్ళి చెయ్యాలని రెండు మూడేళ్ళుగా ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్నో సంబంధాలు చూశాడు. కానీ ఆ సంబంధాలేవీ ఆయనకు నచ్చలేదు - కారణమేమిటంటే జాతకాలు కలవడం లేదంటాడు. ఆయనకు జాతకాల మీదా, శకునాల మీదా, మంత్రాల మీదా, దయ్యాల మీదా పచ్చినమ్మకం - ఈమధ్యనే వాళ్ళూర్లో ఓ భయంకరమైన సంఘటన జరిగింది - వాళ్ళూర్లో ఉండే ఓ ఇద్దరు వ్యక్తులకు మంత్రాలొస్తాయని, మంత్రాలు వేసి వాళ్ళకు గిట్టని వాళ్ళను చంపేస్తున్నారని అనుమానించి ఆ ఇద్దరు వ్యక్తుల్నీ ఆ ఊరి వాళ్ళందరూ కలిసి సజీవ దహనం చేశారట. ఈ విషయాన్ని పత్రికల వాళ్ళు ప్రముఖంగా రాశారు. ఇలాంటి సంఘటనలు ఈ మధ్య చాలా ఊళ్ళల్లో జరిగాయి. ఇంకో ఊర్లోనైతే ఒకేరోజు ఆరుగుర్ని మంత్రగాళ్ళనే అనుమానంతో సజీవ దహనం చేశారట! సైన్స్ ఇంత అభివృద్ధి చెందిన ఈ 21వ శతాబ్దంలో కూడా ప్రజల్లో ఇంత భయంకరమైన మూఢవిశ్వాసాలుండటం చాలా ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. వాళ్ళూర్లో జరిగిన సంఘటనను గూర్చి ఈ ధర్మయ్యగారేం చెబుతారో విందామని ఆయన్ను నా దగ్గరకు పిలిచి మాటల్లోకి దింపాను.

"ఏమండీ ధర్మయ్యగారూ! మొన్న మీ ఊర్లో ఓ ఇద్దరు వ్యక్తుల్ని సజీవ దహనం చేశారట - ఎంతదారుణం!" అన్నాను.

"దారుణం అంటారేమిటి మీరు! వాళ్ళేమన్నా అమాయకులనుకున్నారా? వాళ్ళిద్దరికీ మంత్రాలొస్తాయి... మంత్రాల తోటి వాళ్ళు ముత్యాలమ్మను లేపుతారు - ఫలానా వాణ్ణి చంపిరమ్మంటారు... అంతే ఆ ఫలానా వాడి పని క్లోజ్... అట్లా వాళ్ళు తమకు గిట్టని వాళ్ళందర్నీ ఒకరి తర్వాతొకర్ని ఖతం చేసి పారేస్తున్నారు" అన్నాడు ధర్మయ్య.

"మంత్రాలతో ఓ వ్యక్తిని చంపడం అసంభవం... మీరు బి.ఏ. దాకా చదువుకున్నారు... మీలాంటి వాళ్ళు చదువురాని మూర్ఖులకు మంత్రాలనేవి బూటకం అని చెప్పకుండా మీరు కూడా ఈ మంత్రాలను నమ్మడమేమిటి?" అన్నాను. "బూటకం కాదు. మంత్రాలుంటాయండీ. మీ సిటీలో ఉండేవాళ్ళు ఇట్లనే మాట్లాడతారు. కానీ మేం పల్లెటూళ్ళల్లో రోజూ ఈ మంత్రగాళ్ళను చూస్తూనే ఉంటాం - వీళ్ళు క్షుద్రశక్తుల్ని ఎట్లా వశం చేసుకుంటారో చూస్తుంటాం... లేకపోతే చక్కగా ఆరోగ్యంగా వున్న వాళ్ళు అకస్మాత్తుగా ఏదో ఎవరికీ అర్థంకాని జబ్బు చేసి చచ్చిపోవడమేమిటి? పది రోజుల క్రితం మా ఊర్లో మా సర్పంచ్ కూతురు... పన్నెండేళ్ళ అమ్మాయి రోజూ చక్కగా స్కూలుకెళ్తుండేది. ఓ రోజు స్కూలుకెళ్తూనే ఆ అమ్మాయికి వాంతులూ, విరేచనాలయినయి... పక్కూర్లో ఉండే హాస్పిటల్‌కు తీసుకెళ్ళేలోగానే ఆ అమ్మాయి చనిపోయింది. అంత ఆరోగ్యంగా ఉండే పిల్ల అంత అకస్మాత్తుగా చనిపోవడమేమిటి? ఊర్లో అందరికీ ఈపని బయ్యన్న అనే మంత్రగాడే చేయించాడని అనుమానమొచ్చింది. ఎందుకంటే ఈ బయ్యన్నకు వాడి పాలివాళ్ళతో ఏదో పంచాయతి బడ్తే మా సర్పంచ్ ఆ పంచాయతిని తీర్చిండు - బయ్యన్నకు వ్యతిరేకంగా తీర్పు చెప్పిండు. అప్పట్నించి ఈ బయ్యన్న మా సర్పంచ్‌మీద పగబట్టిండు. ఈ బయ్యన్నకు మంత్రాలొస్తయని మా ఊర్లో అందరికీ తెలుసు. ఊర్లె ఎవరికన్నా దయ్యం పట్టినా, గత్తరయినా ఈ బయ్యన్ననే తీసుకుపోయి మంత్రాలు వేయించుకోవడం, తాయత్తులు కట్టించుకోవడం మామూలే. ఈ బయ్యన్న కూడా తనకు మంత్రాలొస్తయని బాహాటంగా చెప్పుకునేవాడు - ఊర్లె గత్తరయితే ఇల్లిల్లూ తిరిగి మంత్రాలు వేసి మీ ఇంటికిక ముత్యాలమ్మ రాదు.. మీ ఇంట్లో వాళ్ళందరూ క్షేమంగా ఉంటారని చెప్పి వెళ్తుంటాడు. ఇట్లా ఊర్లో ఎవరికే ఆపద కలిగినా బయ్యన్న దగ్గరికే పోతరు. అతడు మంత్రాలు వేసి వాళ్ళను ఆదుకునే వాడు. అతని దగ్గరికెళ్ళిన వాళ్ళందరూ అతనికి తృణమో, ఫణమో ముట్టచెబుతుండేవాళ్ళు. అట్లా అతడు చాలా డబ్బు కూడా సంపాయించాడు - ఈ మధ్యనే మా ఊళ్ళో వీరభద్రుడనే మరో మంత్రగాడు కూడా తయారయ్యిండు. వీడైతే చూడటానికే చాలా భయంకరంగా ఉంటాడు. వీడెన్నోసార్లు అర్ధరాత్రిళ్ళు ఊర్లో తిరగటం, శ్మశానంలో కూర్చొని క్షుద్ర శక్తుల్ని పిలవడం, మా ఊళ్ళో ఇద్దరు ముగ్గురు చూసింద్రు. మంచిగా ఉన్నోళ్ళకు దయ్యం పట్టిందని వీడు అనడం, దాంతో వాళ్ళకు నిజంగానే దయ్యం పట్టడం, వాళ్ళను బాగు చేస్తానని వీడు రావడం, వీడొచ్చి మంత్రాలు వేసి వాళ్ళకు పట్టిన దయ్యాల్ని వదిలించడం, వీడు వాళ్ళ తల్లిదండ్రుల దగ్గర్నించి పెద్ద మొత్తాల్లో డబ్బు గుంజడం ఇట్ల జరుగుతోంది. మొన్నీ మధ్య సిటీలో చదువుకుంటున్న ఇద్దరు యువకులు వీరభద్రుణ్ణి చూసి "వీడికి మంత్రాలురావు. పాడూరావు వీడో పెద్ద మోసగాడు - దయ్యం పట్టిందని చెప్పి వయసులో వున్న ఆడపిల్లల్ని వీడి దగ్గరికి పిలిపించుకొని వాళ్ళను చెడగొడ్తున్నడు-వీణ్ణి పోలీసులకు పట్టియ్యాలే" అన్నార్ర - అంతే - ఆ రాత్రె ఆ ఇద్దరు పోరగాళ్ళు మోటారు సైకిల్ మీద సిటీకి వెళ్తోస్తూ ఊరిదగ్గరికి రాగానే చెరువు కట్టమీదున్న మర్రిచెట్టుకు వాళ్ళ మోటారు సైకిల్ గుద్దుకొని అక్కడికక్కడే చచ్చిపోయింద్రట... ఈ సంఘటన జరిగినప్పుడు వీరభద్రుడు ఆ మర్రి చెట్టు దగ్గర్నే ఉన్నాడు. సర్పంచ్ బిడ్డ చచ్చిపోవుడు, ఈ ఇద్దరు మగపోరగాళ్ళు చచ్చిపోవుడు రెండు రోజుల తేడాతో జరిగాయి. అంతే - ఊర్లో అందరికీ బయ్యన్న మీదా, వీరభద్రుడి మీదా - వాళ్ళే ఈ చావులకు కారణమన్న అనుమానం రూఢి అయిపోయింది. ఊరోళ్ళందరు సర్పంచ్ దగ్గరకుపోతే "ఇవన్నీ చేయిస్తున్నది వాళ్ళే - వాళ్ళను ఇట్లనే వదిలిపెడ్తే ఊరంతా శ్మశానంగా మారిపోతది" అన్నాడు. దాంతో అందరూ వాళ్ళిద్దరి ఇండ్ల మీద పడి, వాళ్ళ పండ్లూడబెరికి, తన్ని, కాళ్ళు చేతులు విరిచికట్టి, పంచాయతీ బోర్డు ఆఫీసు ముందరికి పట్టుకొచ్చి వాళ్ళమీద కిరసనాయిలు పోసి తగులబెట్టింద్రు "మాకేం తెల్వదు. మాకు మంత్రాలు రావు.. ఏదో బతుకు తెరువు కోసం మంత్రాలొచ్చినట్లు నటించి నాలుగు రాళ్ళు సంపాయించుకుంటున్నాం తప్ప మాకేం తెల్వదు'' అని వాళ్ళు తలలు బాదుకొని మొత్తుకున్నారనుకోండి - కాని వాళ్ళమాటలు ఎవ్వరూ వినిపించుకోలేదు. అందరు చూస్తాంటె, పెడబొబ్బలు పెట్టుకుంటు వాళ్ళు చచ్చిపోయింద్రు... ఈ విషయం పోలీసులకు ఎవ్వరూ చెప్పొద్దని, ఎవడైనా పోలీసులకీ విషయం చెబితే వాణ్ణి కూడా ఇట్లనే చంపుతామని ఊరిపెద్దలు ఊర్లో అందరికీ చెప్పింద్రు - అయినా ఎవడో పోయి పోలీసులకు చెప్పనే చెప్పిండు. అందుకే ఇది జరిగిన తెల్లారి పోలీసులొచ్చింద్రు. పత్రికలోళ్ళొచ్చింద్రు. కలెక్టరొచ్చిండు. మా సర్పంచ్‌తో సహా ఊళ్ళో చాలా మంది పరారైపోయింద్రు..." అన్నాడు ధర్మయ్య.

"చూడండి ధర్మయ్యగారూ! వాళ్ళకే నిజంగా మంత్రాలొస్తే, క్షుద్ర శక్తులు వాళ్ళ వశంలో ఉంటే ఊర్లో వాళ్ళంతా వాళ్ళ మీద దాడి చేసినప్పుడు ఆ క్షుద్ర శక్తుల్ని వాళ్ళ మీదకు వదిలే వాళ్ళుకారా? వాళ్ళను వాళ్ళు రక్షించుకునే వాళ్ళు కారా? మీరందరూ కలిసి వాళ్ళ కాళ్ళూ చేతుల్ని తాళ్ళతో కట్టేసి, పశువుల్ని బాదినట్లు బాదుతూ ఈడ్చుకొస్తోంటే వాళ్ళు నిస్సహాయంగా ఎందుకుండిపోయారంటారు? వాళ్ళ మీద కిరసనాయిలు పోసి తగుల బెడ్తున్నప్పుడన్నా వాళ్ళు వాళ్ళ అధీనంలోవున్న క్షుద్ర శక్తుల్ని పిలిచే వాళ్ళు కాదంటారా?"

"లేదు.. లేదు.. మొదలే వాళ్ళ పళ్ళూడగొట్టి వాళ్ళ మంత్రాలు పారకుండా చేసింద్రట.''

"వాళ్ళ ఇంటిమీద దాడి చేసేకదా వాళ్ళ పళ్ళూడగొట్టింది.. వాళ్ళ ఇంటి మీద దాడి చేయడానికొస్తున్నప్పుడే వాళ్ళ మీదకు క్షుద్ర శక్తుల్ని ఉసిగొల్పి వాళ్ళను తమ దరిదాపుల్లోకే రాకుండా చెయ్యొచ్చు కదా... మంత్రాలతో ఒకర్ని చంపగల్గిన వాడు ఆ మంత్రాలతోటే తమను తాము రక్షించుకోవడానికి పది మందిని కూడా చంపుతాడు.. నిస్సహాయంగా మీచేతుల్లో చిక్కిపోయి సజీవదహనానికి గురయ్యే వాడికి మంత్రశక్తులున్నాయని మీరెలా నమ్ముతారు? కూటికోసం కోటి విద్యలన్నట్టు కేవలం పొట్ట కూటికోసమే కొందరు మంత్రగాళ్ళ వేషం వేసుకుంటారు తప్ప నిజంగా మంత్రగాళ్ళెవ్వరూ లేరు. - గత్తర... అంటే కలరా లాంటి రోగాలొచ్చినప్పుడు పూర్వకాలంలో, సైన్స్ అభివృద్ధి చెందని రోజుల్లో ఏ క్షుద్ర శక్తికో కోపం రావడం వల్లనే ఈ రోగాలొచ్చి జనం చనిపోతున్నారనుకునే వాళ్ళు - ఇప్పుడు సైన్స్ కలరా లాంటి రోగాలెందుకొస్తాయో రుజువులతో సహా చెప్పింది. దానికి సరి అయిన మందుల్ని కూడా కనిపెట్టారు. ఆ మందులొచ్చాకే కలరా, మశూచి లాంటి రోగాల నుండి మానవాళి రక్షించబడింది. అలాగే దయ్యం పట్టడమనేది ఒక మానసిక వ్యాధి - దాన్ని మానసిక వైద్యులు నయం చేస్తున్నారు. అంతేగాని దయ్యాలనేవి లేనేలేవు-దయ్యాలూ, దేవుడూ ఈ రెండింటినీ మనిషే సృష్టించాడు - ఇవ్వాళ సైన్స్ ఏది ఎందుకు జరుగుతున్నదో రుజువులతో సహా చెప్పగల్గుతున్నది. రుజువు లేకుండా దేన్నీ నమ్మకూడదు. ఈ ప్రపంచంలో దేవుణ్ణి చూసిన వాడుగానీ, దయ్యాన్ని చూసిన వాడుగానీ ఎవ్వడూ లేడు. దేవుణ్ణి గూర్చిన కథలూ, దయ్యాలను గూర్చిన పుకార్లు - అన్నీ అపోహలూ, అభూత కల్పనలే - కొందరు కేవలం తమ స్వార్థం కోసం ఈ దేవుళ్ళనూ, దెయ్యాలనూ సృష్టించారు - దేవుళ్ళ పేరుతో పూజారులు, దెయ్యాల పేరుతో మంత్రగాళ్ళు సమాజం మీద పడి బతుకుతున్నారు. వీళ్ళే ప్రజల్లో మూఢ విశ్వాసాల్ని పెంచిపోషిస్తున్నారు. ప్రజలందరూ చదువుకొని శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకుంటే పూజార్లకూ, మంత్రగాళ్ళకూ స్థానం ఉండదు. ఇలాంటి అమానుషమైన సజీవదహనాలూ ఉండవు" అన్నాన్నేను.

★



కలంస్నేహం

పేరు : కారే నాగ కిశోర్
వయస్సు : 15
చదువు : 10వ తరగతి
హాబీలు : వాలీబాల్ ఆడటం, పుస్తకాలు చదవడం
పూర్తి చిరునామా : కారే పార్వతి, సురాసాని హరిజనవాడ, పోస్టు : మంత్రిపాలెం, మండలం : మొవ్వ, జిల్లా : కృష్ణా

పేరు : భాష
వయస్సు : 16
చదువు : 10వ తరగతి
హాబీలు : కలంస్నేహం, సంగీతం
పూర్తి చిరునామా : బాషా సాహెబ్, ఇ.నెం : 20-115, హామ్‌దార్డ్ మెడికల్ షాపు, 7రోడ్స్, కడప జిల్లా-1

పేరు : ఎన్. రాధ
వయస్సు : 15
చదువు : 10వ తరగతి
హాబీలు : చెస్, రింగ్‌బాల్ ఆడటం, టీవీ చూడటం, పుస్తకాలు, కథలు చదవడం, డ్రాయింగ్ వేయడం
పూర్తి చిరునామా : డాటరాఫ్ రాములు, గ్రామం : చల్మేడ, మండలం : మునుగోడు, జిల్లా : నల్గొండ-508253

ఎంత?

మా అంకుల్ కొడుకు పేరు అరవిందు. వాడు ఒక రోజు ఫోన్ చేసి 'అంకుల్ రేపు నా బర్త్‌డే, తప్పకుండా రావాలి' అన్నాడు. 'సరేనన్నాను నేను'. మరుసటి సాయంత్రం నేను వాళ్ళింటికి వెళ్ళాను. ఆవేళ బర్త్‌డే ఫంక్షన్ జరుగుతుండగా 'నీ వయసు ఎంత' అని అడిగితే 'తొమ్మిది' అన్నాడు. 'అంటే వచ్చే సంవత్సరం నీ వయసు పది సంవత్సరాలు కదా' అన్నాను. దానికి అరవిందు 'కాదు పదకొండు' అన్నాడు. ఇది ఎలా కరక్టో కనుక్కోండి చూద్దాం.

నువ్వు కూడా కోరుకో..!

నసీరుద్దీన్, అతని స్నేహితుడు ఒకతను కలిసి వెలుతున్నారు. దారిలో అతని స్నేహితుడు ఇలా అడిగాడు. 'నసీరుద్దీన్. ఒకవేళ నీకు ఏదైనా కోరిక కోరుకునే అవకాశం వస్తే ఏం కోరుకుంటావ్?' అని అడిగాడు. దానికి

జవాబుగా నసీరుద్దీన్ 'బోలెడు బంగారం కోరుకుంటాను' అన్నాడు. దానికి స్నేహితుడు 'అయితే అందులో నాకు కొంచెం ఇస్తావా' అని అడిగాడు. వెంటనే నసీరుద్దీన్ 'ఇవ్వను' అని చెప్పాడు. స్నేహితుడు ఆశ్చర్యపోయాడు. 'చిన్నప్పటినుండి మనిద్దరం కలిసి మెలిసి తిరిగాం. నాకు కొంచెం బంగారం ఇవ్వవా' అని కొంచెం కోపంగానే అడిగాడు స్నేహితుడు. అప్పుడు నసీరుద్దీన్ 'కావాలంటే నీవు కూడా బోలెడు బంగారం కోరుకో. అంతేకానీ నాది ఇవ్వను' అన్నాడు.

త్రకారులు

ఎం. ఉదయ్,
10వ తరగతి
జన్నారం

ఆర్. కృష్ణ కుమారి,
10వ తరగతి
అరవింద హైస్కూల్
కుంచనపల్లి

పచ్చదనం పరిమళం

రుక్మిణి

"ఒరే! అసలు మనం పండించిన పంటల్ని మార్కెట్లో ఎపుడూ కొంటంలేదు – అరె... బతిమిలాడితేగాని ఎవుడో ఒకరు కొనడాయె! కొంటే అడ్డీ–పావుసేరు లెక్కన లెక్కలు గట్టుడాయె! ఖర్సుల మంధం కూడా రాటం లేదు" మల్లేశు బహువిచారంగా సోదంతా వెళ్ళగక్కాడు!

"అద్సరె... ఇటు గవర్మెంటు కొనకపాయిరి! చేసిన అప్పులేమో చాంతాడంత వడ్డీతో పెరిగిపోతుండె! ఇగ ఈ యవసాయం బంద్! ఇంగ నేను చచ్చినా అరకగట్టేది లేదు – థు! చూస్తా..." జక్కులోడు రెచ్చిపోయి శివాలెత్తే సరికి అందరూ వాడి నిర్ణయం విని నోళ్ళు బార్లా తెరిస్తే – వాడి భార్య మాత్రం లబలబ లాడింది!

"సూడవె అన్నా... నిన్నట్నుంచీ గిదేవరస... వానలు పడ్డా అరక్కట్టడట! అయినకాడికి ఎడ్లజత అమ్మి పారనూకుతానని పెటపెట బేరానికి తిరుగుతండు! అరె... పిల్లలుగలోళ్ళం! యగసాయం చేయకపోతే బతుకుపెట్ల...

"ఓర్నీ యవసాయానికినా... ఉన్నదాన్లో అరెకరం అమ్మి పారనూకి – 'పహిల్వాన్'లా తిరగొచ్చే! ఇపుడు గీ వడ్డీలు వూటంగా పెరిగితేగా 'పహిల్వాన్' గిరీకూడా దొరకదు. ఫకీరు పాత బొచ్చే గతి"! జక్కులోడు తొడలు చరిచాడు.

రావిచెట్టు క్రింద గుమిగూడిన రైతులందరూ గుడ్లప్పగించారు – ఇది వాడి ఒక్కడి బాధ కాదాయె–అందిరిదీ అదే తంతు!

"ఒరే – మరి బోరుబావికింద పొలం నాది – నేనెవరికి చెప్పుకోను మగడా... యాభై అరవై వేలు అప్పు తెచ్చి పెడితిని – కరంటు రేటుపెరిగి–పెరిగి చతికిల పడితినిగద! అప్పులే అప్పులు... మళ్ళా కరంటుబిల్లు పెంచుతారట..." గురివిగాడు గునిశాడు.

కారు చీకట్లు కమ్ముకుంటున్నాయి – కోవెలలో గుడిగంట మోగింది – దూరంగా బస్సు వచ్చి ఆగినట్లుంది – అదరా బాదరాగా పెద్ద పెద్ద పంగలేసుకుంటూ పచ్చబాబు సరాసరి అక్కడికే వూడి పడ్డాడు – ఆయనగారి వెనకేనెత్తిమీద అట్టపెట్టే ఓటి పెట్టుకుని కాఖీ బట్టలు కట్టుకున్నవాడు మరీ ఆదరాబాదరాగా వచ్చీ రాగానే "పంటల మార్పిడి ఇంటికి లాభం" అనీ 'సంపరదాయక పంటలకూ – లాకౌటూ, లాకప్పూ" అనీ రెండుసార్లు లపలప అరిచాడు –

జక్కులోడు పంటలకు 'క్రాప్‌హోలిడే' అని విన్నాడుగానీ... ఈ పంటలకు లాకౌటూ, లాకప్పేమిటో అర్ధంగాక బుర్ర గోక్కునేంతలోనే పచ్చబాబు వాడ్ని వురిమి చూడడంతో వారు షటప్పైపోయాడు–

"ఒరే – మీరు అనాది, ఆదిమ వ్యవసాయంలో మీ పునాదుల్లేకుండా చేసేసుకుంటున్నారు – మన చెంద్రబ్బాబుగారు చెప్పేది అస్సలు మీ చెవికెక్కడం లేదు. గిట్టుబాటు ధరలో అని రట్టు చేసుకోడవే గానీ – అటు డబ్ల్యుటివో – ఇటు గాటు–నాటు లాంటి ఒప్పందాలు మీకు పట్టినట్లులేవు – మీరు మీసేద్యం పద్ధతుల్ని మార్చాలె! పంటల్ని మారిస్తే బంటికీ ఇంటికీ మంచిది" అని ఓ పావుగంట అవలీలగా అరిచి కాస్తంత అలుపు వచ్చి అరుగు మీద కూలబడేసరికి ఈ పచ్చబాబుగారి ప్లాన్లన్నీ చాలా తకరారుగానూ తమాషాగానూ వుంటాయి. ఒకటే వూదర మనిషి!

"పంటల్తోబాటే పచ్చదనం... పరిమిళం ముఖ్యం.... విదేశీ మారకద్రవ్యం దాకా ఎగబాక కున్నా 'గిట్టుబాటు ధర'కు పుట్టగతులుంటాయి. ఇవి శ్రేష్టమైన కాట్మండూ – అంగోలా – కొలంబియా సరుకు! అబ్బో! లాభాల మాట దేవుడెరుగు – మీకు 'రైతు రత్నా' – 'కర్షక ఆకర్షో' బిరుదు మాత్రం ఖాయం. వీని పోటీ యమాగా పెరిగిపోయింది. అంతాగప్‌చిప్ – చుట్టుపక్కల్నుండి పోటీకి జనాలు ఎగబడకముందే మనూరికివి చాలా అవసరమని అవస్థలుపడి తెచ్చాను! రహస్యం – స్వయం సహాయకబృందాలు... వన సంరక్షణ సమితులు.. ఉపాధికల్పనలకిది బెటరు ! భూమల్లేని వాండ్లు అటవీ భూముల్లో... బంజర్లలో సాగు కానిస్తే మీ కాళ్ళమీద మీరు నిలబడి మన రాష్ట్ర పరువు నిలబెడతారు సుమా! వరల్డు బ్యాంకు సాయం వుండనే వుంది. అదేం గింజలో గానీ.. పచ్చబాబు 'పచ్చిగడ్డి' ఏరుకునే రకం మాత్రం కాదని తెలుసు! అందుకే జక్కులోడు హుషారుగా ఈలేశాడు.

"మెట్ట సరుకు, బోరుబావీ... బోలెడు కరంటు బిల్లూ.. నీటి తీరువా.. ప్రాజెక్టు కాలువా అవసరం లేదు. పురుగుల మందులూ... ఎరువుల ఆపదా లేదు. డబ్బో డబ్బు! దేశసేవా – కాస్తంత పర్యావరణ పరంగా 'పరిమళం' మరీముఖ్యం! విదేశీ టూరిస్టుల విహారం...మనకు డాలరుదండల హారం...

పచ్చబాబు లొడలొడ వాగుతూనే వున్నాడు – పక్కనే కాఖీ బట్టల వాడు కాకిలా మిర్రిమిర్రి చూస్తూ తగినట్లుగా చేతులూపుతూ 'రంజు' సైగలు చేస్తూనే వున్నాడు.

వెంటనే యాద్గిరీ, మల్లేశు అందరూ 'పొలో'మని గింజలందుకుని పొలాల వెంట పడ్డారు.

* * *

పచ్చబాబు గారు చెప్పింది నిజవే! నెలా రెండు నెలలు గడిచేసరికి పెసరపైరులా ఊపుగా... గుబురుగా పైరు పెరిగి పోసాగింది! వాళ్ళ ఆనందానికి అంతేలేదు. కాఖీ బట్టలవాడుమాత్రం అడపా దడపా వచ్చి తనిఖీ చేసి పోతున్నాడు.

"వాడిది ఆగ్రో కల్చరు – లాకవ్ లడాయిగాడు.. అంతా విదేశీ వ్యవహారం వంటబట్టించుకున్న నేర్పుది – మీ కష్ట సుఖాల్లో కలిసి మెలిసి ఆదుకుంటాడు – అందుకే మీకు వాడ్ని కాపలాగా – కన్సెల్టీ కింద తగిలించా – ఆనక ఏదో ఉడతా భక్తి..." పచ్చబాబు పచ్చడి జుర్రినంత సులాగ్గా.. పలావు తిన్నంత పసందుగా అన్నాడు.

"ఒరే... పైరయితే పెరగడం వరకు రివరివ పెరిగిపోతుంది గానీ.. దీనిక్కాసే కాయలు మినుం కాయలా... మిరపకాయలా... మామిడి పిందెలా? ఫారిన్ సరుకంటాడు... రంగుపూలు గానీ కాదు గదా?" యాద్గిరి అనుమానంగా అయోమయంగా అడిగాడు. అప్పటికే ఆ ప్రాంతమంతా పరిమళాలు విరజిమ్ముతూ బృందావనంలో బృందగానం పాడుతున్నట్లుంది!

ఒకనాడు జక్కులోడు కసిపట్టలేక కుసింత ఆకందుకుని కసాపిసా నలిపి ముక్కు దగ్గిర గాంట్రించి వాసన ఓ పీకు పీకి 'ఢా'మ్మని విరుచుకుపడ్డారు. వాడి భార్య రోదనలకు తగులుకుంది – 'ఇదెక్కడి పరిమళంరో దేవుడో... ప్రాణాల్తో పరాచికాలా... అని రాగాలు తీసేసరికి – సమయం మించకపోవడంతో జక్కులోడు దిగ్గున లేచి నిర్ఘాంతపడి అధాటున నోరు తెరిచాడు.

"ఇది గంజాయి... దీని మీద పచ్చబాబు క్రాపులోనూ.. బినామీ బ్యాంకులోనూ కూడా పట్టిచ్చినారు – హన్నా... ఏగుమతులకు వరల్డు బ్యాంకన్నాడు – ఎన్ని కోట్ల రూపాయిల గింజలురా!" కాఖీ బట్టలవాడులేనిపోని పనికిమాలిన క్రౌర్యంతో చూస్తూ అన్నాడు.

"అరె... స్వర్ణాంధ్ర కావాల్నంటే ఇది బెటరు... బ్యాంకువారి సూచనలకూ... సలహాలకూ చానా బాగుంటుందనే తగులుకున్నాం.... ఎట్లాగూ ఏడావుపడే పొలాల్ని పండిస్తే పండగ జరిగిపోద్ది! మా కాళ్ళ మీద నిలబడాలంటిరి! 'పచ్చదనం – పరిమళం' అని వాయించితిరాయె! అయినా మీరే గదా గింజలూ... తోలూతొక్కాలోనూ అందించిందీ... పచ్చదనం... పరి...

"అరె... గప్‌చిప్‌న గమ్మున పండించుకుని అమ్ముకుందాంరా అంటే గత్తర గత్తరగా 'పచ్చదనం – పరిమళం' అని అందినోడికల్లా ప్రచారం చేసిపారేస్తిరాయె! పైన హైదరాబాద్‌లో అల్లకల్లోలంగా తెలిసిపాయె! మా ఉద్యోగాలకు ఎసరూ – మీ కొంపలకు ముసురూ తగులుకునె...

వాడు మాటలు ముగించకముందే చీమల్లా స్పెషల్ పోలీసులు ఎగబడి చెట్లన్నీ పీకి పోగులుపెట్టి కిరసనాయిలు పోసి నిప్పంటించేస్తున్నారు.

"మన చెంద్రబాబుగారు 'పచ్చదనం' అంటున్నారు గదా... మన పచ్చబాబు గారు 'పరిమళం' అని కూడా తగిలించి వీటి 'పని' మనకు అంటగట్టె! కోట్లు విదేశీ ద్రవ్యం... స్వయం ఉపాధి... విమానం... టూరిస్టులు.. పరిమళం... అన్నాడు గదా? ఏడీ?"

పచ్చబాబు పత్తాలేడు!

★

భారత్ తీరు మారదా!

ఎం.కె.రాంప్రసాద్

భారత జట్టు వన్డే సిరీస్‌ను గెలుచుకునే అవకాశాన్ని చేజేతులారా పోగొట్టుకోవడం చూస్తుంటే కన్యాశుల్కంలో గిరీశం సంభాషణలు గుర్తుకు వస్తాయి. ఆరు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను గెలుచుకునే సువర్ణావకాశం భారత్‌కు లభించింది. అయితే చివరి రెండు వన్డేల్లో గెలిచేందుకు, తద్వారా సిరీస్ కైవసం చేసుకునేందుకు లభించిన అవకాశాన్ని భారత్ బ్యాట్స్‌మెన్ మట్టిపాలు చేశారు. ఇంగ్లండ్ సిరీస్‌ను సమం చేసిందనేకంటే భారత్ బ్యాట్స్‌మెన్ సిరీస్‌ను ఇంగ్లండ్‌కు ధారాదత్తం చేశారనడం సమంజసంగా ఉంటుంది. కీలకమైన సమయాల్లో తొట్రుపడటం, సరైన ప్రణాళిక రూపొందించు కోలేకపోవడం ఇందుకు కారణంగా పేర్కొనవచ్చు. న్యూఢిల్లీలోని ఫిరోజ్‌షా కోట్లా మైదానంలో అత్యంత పోటాపోటీగా సాగిన ఐదవ వన్డేలో భారత్ గెలుపు అంచులవరకూ వచ్చి బోల్తా పడింది. చివరి బ్యాట్స్‌మెన్



అనుభవరాహిత్యం కారణంలే అని సరిపెట్టుకుందామన్నా ముంబయిలో జరిగిన చివరి వన్డేలో చరిత్ర పునారావృతమైంది. రెండు వికెట్లకు 155 పరుగుల స్కోరుతో పటిష్టంగా ఉండి గెలిచేందుకు ఉరకలేస్తున్న భారత జట్టు ఒక్కసారిగా వికెట్లు కోల్పోయి పరాజయంతో తలవంచాల్సి వచ్చింది. భారత్ ఇన్నింగ్స్ పేకమేడల్లా కూలిపోతుంటే హీరాయిక్ ఇన్నింగ్స్ ఆడి భారత్ నావను ఒడ్డుకు చేర్చేవారే కరువయ్యారు. ఢిల్లీ మ్యాచ్‌లో చివరి ఓవర్లలో చెలరేగి ఆడి భారత్‌ను గెలుపు వాకిట వరకూ తెచ్చిన అగార్కర్ చివరి వన్డేలో డకౌట్ కావడంతో భారత్ ఆశలు నీరుకారిపోయాయి. బిగ్ హిట్టర్‌గా ఇటీవల కొత్త అవతారం ఎత్తిన హర్భజన్ సింగ్ క్రీజ్‌కు వచ్చినప్పటి నుండి ఎప్పుడు పెవిలియన్‌కు తిరిగి వెళ్ళాలా అని ఎదురుచూస్తున్న వాడిగా కనిపించాడు. అనేక వన్డేలు ఆడిన అనుభవం కల కుంబ్లే కూడా బ్యాట్‌ను ఝుళిపించలేకపోయాడు. ఫలితంగా నోటివరకూ వచ్చిన మృష్టాన్న భోజనం నేలపాలైనట్లయింది. ఆరు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ను భారత్ ఆశావహంగానే ప్రారంభించింది. కొల్‌కతాలో జరిగిన మొదటి వన్డేలో భారత్ 22 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ గెలిచేందుకు అవసరమైన 282 పరుగులను చేసింది. అయితే ఇంగ్లండ్ సవాలును స్వీకరించి గెలిచేందుకు శతథా ప్రయత్నించింది. ఓపెనర్ ట్రెస్కోతిక్ క్రీజ్‌లో ఉన్నంతసేపూ ఇంగ్లండ్‌దే విజయమనిపించింది. 124 పరుగులుచేసిన ట్రెస్కోతిక్ అవుటైన తర్వాత మ్యాచ్ తీరే మారిపోయింది. ఇంగ్లండ్ క్రమంగా వికెట్లు కోల్పోయింది. అగార్కర్ రాణించి మూడు వికెట్లు తీసుకుని ఇంగ్లండ్‌ను దెబ్బతీశాడు. ఈ మ్యాచ్‌లో స్టార్ బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్కర్ పదకొండువేల పరుగుల మార్క్ చేరడం విశేషం. కటక్‌లో జరిగిన రెండవ వన్డేలో ఇంగ్లండ్ ఎదురుదెబ్బ తీసింది. ఇంగ్లండ్ చేసిన 250 పరుగులను అధిగమించే ప్రయత్నంలో భారత్ 234 పరుగులకే ఆలౌటైంది. భారత్ ఇన్నింగ్స్‌లో ముగ్గురు రనౌట్ కావడం విశేషం. ఇక చెన్నయ్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత్ విశ్వరూపం చూపింది. ఇంగ్లండ్ 217 పరుగులకు ఆలౌట్ కాగా భారత్ తన విజయలక్ష్యాన్ని 46.4 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి సాధించింది. మొదటి వికెట్‌కు సచిన్, సెహవాగ్ 107 పరుగులుచేసి పటిష్టమైన పునాది వేసినప్పటికీ మిడిల్ ఆర్డర్ కుప్పకూలింది. వికెట్ కీపర్ అజయ్ రాత్రా, అగార్కర్ ఆదుకుని భారత్‌ను తీరం చేర్చారు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌కు చెందిన ఏడుగురు బ్యాట్స్‌మెన్ క్యాచవుట్ అయ్యారు. అగార్కర్ మరోసారి రాణించి 34 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 48 ఓవర్లలోనే ముగిసింది. ఈ మ్యాచ్‌లో గెలుపుతో భారత్‌కు 2-1 ఆధిక్యత లభించింది. ఇక కాన్పూర్‌లో జరిగిన నాల్గవ వన్డేను భారత్ అభిమానులు చిరకాలం గుర్తుంచుకుంటారు. ఈ మ్యాచ్‌లో భారత్ ఓపెనర్లు సచిన్, సెహవాగ్ శివమెక్కినట్లుగా బ్యాటింగ్ చేశారు. మంచు కారణంగా 39 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ తొలుత బ్యాటింగ్ చేసి ఏడు వికెట్లకు 217 పరుగులు చేసింది. సచిన్, సెహవాగ్ వీరవిహారం చేసి బౌండరీల వర్షం కురిపించి స్టేడియంలో ప్రేక్షకులను విపరీతంగా అలరించారు. భారత్ తన లక్ష్యాన్ని 29 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి సాధించింది. సచిన్ 87, సెహవాగ్ 82 పరుగులు చేశారు. రెండు మ్యాచ్‌ల్లో భారత్ రాణించిన తీరు చూసి ఉబ్బితబ్బిబ్బైన భారత్ అభిమానులు ఇక సిరీస్‌ను గెలుచుకోవడమే తరువాయని ఆశపడ్డారు. ఇది అత్యాశని ఇంగ్లండ్ చివరి రెండు మ్యాచ్‌ల్లో నిరూపించింది. భారత్‌ను ఓడించడం పెద్ద సమస్య కాబోదని, ఒత్తిడి తీసుకువస్తే వారే ఓడిపోతారని సిరీస్ మందు ఇంగ్లండ్ కెప్టెన్ నసీర్ హుస్సేన్ చేసిన వ్యాఖ్యలు అక్షరసత్యాలయ్యాయి. రెండు మ్యాచ్‌లో ఘోరంగా ఓడిపోతే అదొక సంగతి. గెలుపువాకిట వరకూ రావడం, చివరిలో చేతులెత్తెయ్యడం భారత్‌కు ఆనవాయితీగా మారింది. ఇది విదేశాల్లోనే కాదు, స్వదేశంలో కూడా కొనసాగడం బాధాకరం. స్వదేశంలోనే సిరీస్ గెలుచుకోలేకపోతే విదేశాల్లో ఎలా సాధ్యపడుతుంది. ఇంగ్లండ్ మాజీ క్రీడాకారుడు జెఫ్ బాయ్‌కాట్ వ్యాఖ్యానించినట్లుగా భారత్ జట్టులో ప్రతిభకు కొరత లేకపోయినప్పటికీ సమిష్టిగా ఆడటంలో విఫలమవుతున్నారు. ఇది ఒక్క భారత్ జట్టు విషయంలోనే జరుగుతుంది. ఫైనల్లో ఓడిపోవడం భారత్‌కు క్యాన్సర్ రోగం లాగా మారింది. దీనిని చక్కదిద్దగల నాథుడెవరో తెలియడం లేదు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికైనప్పటికీ సచిన్ ఈ సిరీస్‌లో ఆశించినంతగా రాణించలేదు. ముఖ్యంగా చివరి వన్డేలో హోం పిచ్‌పై ఆడుతున్నప్పటికీ సచిన్ ప్రేక్షకులను నిరాశపరిచాడు. ఇన్నింగ్స్ ప్రారంభంలో రెండు షాట్లు కొట్టి అలరించినప్పటికీ అవి ఫ్లాష్ ఆన్ ది పాన్‌గానే మిగిలాయి. అయినా కీలకమైన మ్యాచ్‌ల్లో సచిన్ విఫలమవడం ఇదే తొలిసారి కాదు. తప్పనిసరిగా ఆడాల్సిన మ్యాచ్‌ల్లో విఫలం కావడానికి కారణమేమిటో సచిన్ సమీక్షించుకోవాలి. ప్రపంచంలోనే మేటి బ్యాట్స్‌మన్‌గా కొనియాడపడుతున్న సచినే ఇలా ఒత్తిడికి తలవొగ్గుతుంటే ఇతరుల సంగతేమిటి? ఇక గత కొద్ది కాలంగా పరుగులు చేయలేక నానా అవస్థలు పడుతూ ఇంటాబయిటా విమర్శలు ఎదుర్కొంటున్న కెప్టెన్ గంగూలీ ఈ సిరీస్ కొంత సంతృప్తి ఇచ్చింది. దాదాపు అన్ని మ్యాచ్‌ల్లో బాగానే ఆడాడు. ముఖ్యంగా ముంబయి, ఢిల్లీ మ్యాచ్‌ల్లో బాగా బ్యాటింగ్ చేశాడు. హర్భజన్ తన పోరాటపటిమను మరోసారి నిరూపించుకున్నాడు. సెహవాగ్, దినేష్ మోంగియాలకు కూడా ఈ సిరీస్ సంతృప్తి నిచ్చింది. వికెట్ కీపర్ అజయ్ రాత్రా ఇంకా పరిణితి పెంచుకోవాల్సి ఉంది. వికెట్ కీపింగ్ బాగానే ఉన్నప్పటికీ కొన్ని సునాయాసమైన క్యాచ్‌లను జారవిడుస్తున్నాడు. బ్యాటింగ్‌లో తన సత్తా చూపేలకపోయాడనే చెప్పవచ్చు. ఇక రెండు జట్ల మధ్యా ప్రధాన వ్యత్యాసం ఫీల్డింగ్, పట్టుదల అని చెప్పాలి. ముంబయిలో జరిగిన చివరి వన్డేలో ట్రెస్కోతిక్‌కు రెండు సార్లు లైఫ్ ఇచ్చారు. ఇది భారత్‌కు అశనిపాతంలా పరిణమించింది. జింబాబ్వే జట్టు భారత్ పర్యటనకు రానుంది. ఆ జట్టులో ఫ్లవర్ సోదరులను కట్టడి చేయడం భారత్ బౌలర్ల ముందున్న తక్షణ సవాలు. ఇంతకు ముందు జరిగిన సిరీస్‌లో ఈ ఇద్దరు రాణించారు. ★

మృత్యువు మాతృత్వం

ఐనాల సైదులు

రాంబాబు క్యారిడార్‌లో అటూ ఇటూ తిరుగుతున్నాడు. మొఖం నిండా చెమటలు కమ్ముకున్నాయి. గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఏమవుతుందోనన్న భయం. ఎప్పుడు ఆమాట వినాల్సి వస్తుందోనన్న టెన్షన్. జేబులోని రుమాలును తీసి మొఖంపై అద్దుకున్నాడు. అసలు తనకిష్టం లేకుండానే ఇదంతా జరుగుతోంది. అప్పుడే గట్టిగా వారించి వుంటే ఇప్పుడింత టెన్షన్ ఉండేది కాదు. తన నిస్సహాయత తన్నే వెక్కిరిస్తోంది. "రాంబాబుకి డాక్టర్లంతా తన లక్ష్మి ప్రాణాల్ని తీసుకుపోవడానికి వచ్చిన యమదూతల్లా కన్పిస్తున్నారు". ఎవరి బిజీలో వారున్నారు. వార్డు నెంబర్ ముప్పై మూడు. ఇరవై మూడో గదిలో మరింతమంది జనం వున్నారు. వాళ్ళంతా లక్ష్మిని సంతోషంగా సాగనం పడానికి వచ్చారన్నది రాంబాబు అభిప్రాయం. "అసలు ఎవరి అభిప్రాయాలు వారివిగానే ఉండాలి". ఒకరిమీద మరొకరు తన అభిప్రాయాల్నిరుద్దడమేంటి? ఒకరిపై ఇంకొకరు, ఒకజాతిపై మరొకజాతి, ఒక వర్గంపై మరొక వర్గం ఆధిపత్యం ఇంకెన్నాళ్ళు "ఇంకానా ఇక సాగవు".

రాంబాబు పరిస్థితిని గమనించిన వాళ్ళమ్మ వాటర్ బాటిల్ అందిస్తూ "డోంట్‌వర్రీ మై సన్" "వైయ్యార్యూ ఫీల్ సో టెన్షన్" అని ఆధునికతకు సింబలనుకునే ఇంగ్లీష్ మాటల్ని పెదాలపై సన్నగా వదులుతూ చెబుతుంటే రాంబాబుకు మరింత కోపమొచ్చింది. ఏమనాలన్నా ఇది సమయం కాదనుకొని గటగటా నీళ్ళన్నీ తాగి ఖాళీ బాటిల్‌ని డస్ట్‌బిన్‌లోకి విసిరాడు.

"ఏమవుతుందో ఏమో చెప్పలేం, పెద్ద ప్రాణానికి ముప్పు రావచ్చు. మిస్టర్ రాంబాబూ! ఈసారికి లక్ష్మి మాతృత్వానికి దూరంగా ఉండటం మంచిది" డాక్టర్ వేణు చెప్పిన మాటలు కందిరీగల్లా తిరుగాడుతున్నాయి. వార్డంతా హడావిడిగా ఉంది. డబ్బున్న వాడికి రోగమొచ్చినా, వాని పెళ్ళానికి పురిటి నొప్పులొచ్చినా ఈ డాక్టర్ల హడావిడి అంతింతకాదు. ప్రపంచానికేదో పెనుముప్పున్నంతగా హైరానా పడతారు.

ఈ హడావిడులు, హైరానాలు పేదవాడు, ఒక సామాన్యుడికి జబ్బొచ్చి కళ్ళముందే కళ్ళుమూస్తున్నా ఉండవెందుకో? ఈ ప్రశ్న రాంబాబుకి ఆరేళ్ళ వయస్సులోనే కలిగింది. అదే మాట వాళ్ళమ్మని అడిగితే కొడుకు అమాయకత్వానికి అబ్బురపడి బుగ్గలమీద ముద్దుల్ని - కురిపించి "బెల్లం ఉన్న దగ్గర్నే ఈగలధికం నాన్నా" అని చెప్పిన మాటలు అప్పుడంతగా అర్థం కాలేదుగాని ఇప్పుడు బోధపడింది పూర్తిగా ఆ మాటలసారం.

"ఏయ్ సుశీ! ఈ రోజు సాయంత్రం క్లబ్బులో అంతా నీ హడావిడన్నమాట!!" రాంబాబు కొడుకుని కాదు... కాదు సుశీల రెండవ తరం వారసుణ్ణి చూట్టానికి వచ్చిన అమ్మలక్కల మాటలు రాంబాబులో అసహనాన్ని పెంచుతున్నాయి. అటు తన భార్య చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే ఏ మాత్రం జాలి కూడా లేకుండా కనీసం "పాపం" అనైనా అనకుండా సాయంత్రం జరిగే పార్టీల గురించి మాట్లాడుకోవడం వాళ్ళ స్త్రీ స్వేచ్ఛకు, స్టేటస్‌కు సింబల్‌గా చెప్పకనే చెప్తున్నట్లుగా వాళ్ళ ప్రవర్తన చూసి రాంబాబు చీదరించుకున్నాడు.

అమ్మా... గట్టిగా కేక... ఆపరేషన్ రూం నుండి లక్ష్మి వేసిన చివరి కేక. రాంబాబుకు టెన్షన్ మరింత ఎక్కువైంది. అదంతా మా ఆడాళ్ళకు కామనన్నట్లుగా అమ్మ వాళ్ళ ఫ్రెండ్స్‌తో ముచ్చట్లలో మునిగింది. రాంబాబు చెవుల్లో లక్ష్మి కేకలు గిర్రున తిరుగుతున్నాయి "ఈ ఒక్కసారికి అబార్షన్ చేయించుకో లక్ష్మీ, అసలే నీరసంగా వున్నావ్." ఈ మాట ఎన్నిసార్లన్నా వినిపించుకోలేదు. ఎందుకంత మొండితనం లక్ష్మికి. లక్ష్మి మీద కోపం, అసహనం, అమ్మమీద అసహ్యం. వెరసి రాంబాబు ఒకచోట నిలబడలేకపోతున్నాడు. అసలు ఈ విషయంలో లక్ష్మి నిమిత్తమాత్రురాలేనన్నది రాంబాబుకు తెలిసీ అమ్మని ఎదిరించలేక మాటాడలేకపోయాడు. నేనంటే ఎదిరించలేకపోయాను. తనైనా తన అనారోగ్యం గురించి చెప్పొచ్చు కదా? ఆలోచనలతో రాంబాబు బుర్ర వేడెక్కింది.

వచ్చిపోయే పేషంట్లు, డాక్టర్లు, వాళ్ళ వెనుక పరుగులు తీస్తున్న నర్సులు, ఆపరేషన్ సామాగ్రితో అటూ ఇటూ తిరిగే వాళ్ళతో వార్డంతా నిండుగా ఉంది. హైదారాబాద్‌లోనే పేరున్న హాస్పటల్ కావడంతో పేరున్న గొప్పోళ్లంతా ఇక్కడికే వస్తారని తెలిసింది రాంబాబుకి. అందుకేనేమో పరుగెడుతున్నంత వేగంగా పనులు జరుగుతున్నాయని అనుకున్నాడు. అయినా రాంబాబు మనసు కీడు శంకిస్తోంది. పేరున్నోళ్ళ కోడళ్ళంతా ఇక్కడ్నుంచే యమలోకానికి డబ్బిచ్చి టికెట్లు కొనుక్కుంటారని ఎప్పుడో తన స్నేహితుడన్నమాట నిజంగానే తోస్తోంది రాంబాబుకి. ఆ ఆలోచన తోచిందే తడవుగా ఊగిపోయాడు. బోరున ఏడ్వాలన్పించింది. అసలు ఆ ఆలోచనే ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇక లాభం లేదు అలాబయటకెళ్ళి టీ, తాగి సిగరెట్ వెలిగిస్తేనన్నా కొంత ఉపశమనం. అనుకున్నంత వేగంగా అక్కడి నుండి కదిలాడు.

"బాబూ చింటూ ఎక్కడికిరా"? తన కొడుకు చిన్ననాటి ముద్దుపేరుతో పిలిచింది సుశీల. సుశీల ఆనందంలో ఉన్నప్పుడు అలా ముద్దుపేరుతో పిలుస్తుంది. ఇప్పుడామె ఆనందం తీరాన్ని దాటుతోంది. కమాన్ చింటూ! నీకోసమే మా ఫ్రెండ్ వెయిట్ చేస్తున్నారు. పరిచయమైన తరువాత వెళ్దువుగాని" సుశీల పిలుపు అసందర్భం అనిపించి మరింత వేగంగా బయటకు నడిచాడు తనకు వినపడనట్లుగా.

సుశీల నగరంలో పేరున్న ఒక మహిళా సంఘం అధ్యక్షురాలు. అంతా ఆమెను సుశీ అని పిలుస్తారు. కాదు... కాదు. అలా పిలిపించుకోవడంలో తానెంతో ఆనందానుభూతిని పొందుతానని చెబుతుందామె. "నెల తిరిగే సరికి పర్సు నింపుకొని అలా ఇష్టమొచ్చినట్లు తిరుగుతుంది" ఇది సుశీలంటే గిట్టని వాళ్ళనేమాట.

"పురుషాధిక్యం నశించాలి. స్త్రీ పురుషుడితో సమాన హక్కుల్ని పంచుకోవాలి. ఇంకా ఈ పురుష పెత్తనం ఎంతకాలం? స్త్రీకి పురుషుడ్నుంచి స్వేచ్ఛ కావాలి. తను సంపాదించే పర్సు మీద తనకే సర్వాధికారం ఉండాలి" ఇది నా ఆశయం. ఆదర్శం కూడా. దీనికి మీరే పేరు పెట్టుకున్నా నాకభ్యంతరం లేదు" సుశీల అభిప్రాయం ఇది.

సుశీల భర్త శ్రీనివాస్. పెద్ద కంపెనీలో ఇంజనీర్‌గా పని చేస్తుంటాడు. నెలకు నాలుగు చేతులా

పొగెయ్యడం ఆయన పని. "అలా చెయ్యకపోతే మాలాంటి పెద్ద కుటుంబాలు స్టేటస్‌కు తగ్గట్టుగా బతకలేం" సమయమొచ్చినప్పుడల్లా ఆయన చెప్పే మాటలివి. పెళ్ళి కంటే ముందు ఎన్నోఎన్నెన్నో మాటలు - స్త్రీలకు స్వేచ్ఛ కావాలని, అదీ భర్తల్నుంచే ముందు పొందాలని. అసలు స్త్రీకి శత్రువు తన భర్తేనని, స్త్రీలు విజృంభించాలని చెప్తుండేవాడు. ఇవే మాటలు మరింత ఆవేశంతో చెప్పడంతో సభలో ఉన్న వాళ్ళంతా చప్పట్లు మోగించారు. స్త్రీ స్వేచ్ఛపై శ్రీనివాస్ చెప్పిన విషయాలు ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు ఆ సభలో వున్న సుశీలను ఆకట్టుకున్నాయి. నిజంగా తన అభిప్రాయాలకు, తన స్వేచ్ఛాన్వేషణకు మంచి తోడుగా భావించింది. అంతటితో ఆమె ఆగలేక పోయింది. "లవ్ ఎట్ ఫస్ట్ సైట్". వాళ్ళ ప్రేమ పెళ్ళి వరకూ వచ్చింది. అప్పటిదాకా గుర్తుకు రాని కులం, కుల పెద్దలు, సంఘం, సమాజం గుర్తొచ్చింది శ్రీనివాస్‌కి. అయినా సుశీల ఆస్తికి అవేమీ సరితూగవని తెలుసుకొని సరే అన్నాడు. గుట్టుచప్పుడు కాకుండా గుళ్లో పెళ్ళికి సిద్ధమయ్యారు. ఆ తరువాత కొంత కాలానికి పార్టీవేదిక మీద "ఆదర్శవివాహం" పేరుతో మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు. అందరికీ ఆదర్శంగా నిలవాలని అంతా ఆశీర్వదించారు. ఆ పొగడ్తల్లో కొన్నాళ్ళు మునిగి తేలారు ఇద్దరూ. ప్రతి ఒక్కరిలో మార్పు సహజమంటారు. ఆ మార్పుకు వీళ్ళు కూడా అతీతులు కారన్నట్లుగా తమ మధ్యనున్నది ఆకర్షణేనన్న నిజాన్ని తట్టుకోలేక ఒకరిమీదనొకరు నిందలేసుకున్నారు. ఎవరికీ చెప్పుకోలేక ఎక్కడ స్టేటస్ తగ్గుతుందోనని అతను, ఎక్కడ తనకు చిన్నచూపు ఎదురవుతుందోనని ఆమె. ఇద్దరూ సమాజానికి, స్టేటస్‌కి లొంగిపోయి మూగగా, ఎవరికి వారుగా జీవించడం, సమాజం దృష్టిలో ఆదర్శ జంటగా కన్పించడం నేర్చుకున్నారు. సుశీల తన వారికి ఒక్కతే కూతురు కావడంతో తదనంతర ఆస్థి ఆమెకే వచ్చింది. ఆ ఆస్థికి తన కొడుకు రాంబాబు. సరైన వారసుడవుతాడన్న ఆశతో సంతృప్తిగా బతుకుతోంది సుశీల.

తను ఉండగానే ఆ తరువాతి వారసుణ్ణి తనివి తీరా చూడాలన్నది సుశీల పట్టుదల. తన కోడలు లక్ష్మి చాలా అణకువగా ఉంటుంది. ఎప్పుడూ తన మాటకు అడ్డు చెప్పేది కాదు. అంతకాదు తాను మాట్లాడాలనుకున్న ప్రసంగానికి ఒక రోజు ముందుగానే స్క్రిప్ట్ రాసిచ్చేది. అవి చదివే ఎన్నోసార్లు పెద్ద పెద్ద వాళ్లతో శభాష్ అనిపించుకుందామె. అందుకే లక్ష్మంటే సుశీలకు చెప్పలేనంత ప్రేమ. క్లబ్బులో ఒక రోజు "ఏమే నీ కోడలు పీజీ చేసిందికదా! ఇంట్లోనే ఉండకపోతే ఏదో ఉద్యోగం చెయ్యొచ్చుగా?" అన్న స్నేహితురాండ్ర మాటలకి "అసలే ఆమె ఒంట్లో సరిగుండదు. ఉద్యోగమంటూ అలసిపోయి ఇంటికొచ్చి సరిగా తినక ఆ తరువాత ఏమన్నా అయితే నే తట్టుకోగలనా?" సుశీల మాటలు పూర్తికాకుండానే "ఆడదంటే ఆడదానికి శత్రువు కాదు అని. అత్తగుండెలో కూడా అమ్మ ఉందని" ఎవరో పాట ఎత్తారు అంతా కోరస్ కలిపారు.

"మరి క్లబ్బుకైనా అప్పుడప్పుడు తీసుకురావచ్చు కదా?" ఏదో ఒకటి చెప్తుతుందని తెలిసినప్పటికీ మళ్ళీ అడిగారు. "చూడండి ఎవరి ఇష్టాలు వారివి. మన ఇష్టాన్ని ఇంకొకరిపై, ఇంకొకరి ఇష్టాల్ని మనపై రుద్దడం, ఆధిపత్యం చలాయించడం, వీటి మీదనే కదా మన తిరుగుబాటంతా! కనుబొమ్మలు పైకెత్తి ప్రశ్నించేసరికి అవునూ! అంటూ ఒకసారే అన్నారు. సో - నా కోడలు నేను గట్టిగా రమ్మంటే వస్తుంది. బట్ ఆమె ఇష్టంగా చదివే నవలల్ని వదిలి పెట్టాలి కదా! మరి అది మన దృష్టిలో అత్త ఆధిపత్యం కాదా! అందుకే లక్ష్మి ఇష్టం, వస్తే వద్దననూ, రానంటే రావాలనీ చెప్పనూ? దటీజ్‌మై పాలసీ. అంతేకాదు. మన ఉద్యమ పాలసీ కూడా అదే కావాలి. ఎవరి ఇష్టం వచ్చిన పని వాళ్ళు చేసుకోవాలి. అప్పుడే ఈ సమాజంలో స్వేచ్ఛ, సమానత్వం విరాజిల్లుతుంది" గుక్కతిరక్కుండా చెప్పింది సుశీల.

బాటిల్‌లోని నీళ్ళు ఖాళీ చేసి "ఓకే షల్ వియ్ గో" అంటూ కుర్చీలోంచి లేచింది.

* * *

రోజులు గడిచిపోతున్నాయి. వారసుడు పుడతాడన్న ఆశ సుశీలలో నానాటికీ సన్నగిల్లుతుంది. ఇప్పటికే స్కానింగ్‌లో ఆడపిల్లని తెలుసుకొని లక్ష్మికి రెండుసార్లు అబార్షన్ చేయించింది కూడా.

"అమ్మా... అమ్మా... లక్ష్మి వామ్‌టింగ్స్ చేసుకొంటుందే" కొడుకు మాటలతో గాల్లో తేలియాడింది. సంతోషంతో ఉక్కిరి బిక్కిరై లక్ష్మి నెన్నిసార్లు ముద్దాడిందో తెలియదు. ప్రతిరోజూ డాక్టర్ని ఇంటికే పిలిపించేది. స్కానింగ్‌లో "మగబిడ్డ"ని తెలిసి ఆమె ఆనందానికి అవధుల్లేవు.

"లక్ష్మి ప్రస్తుతం ఉన్న కండిషన్‌లో బిడ్డను కనలేదు. ఇంతకుముందు జరిగిన అబార్షన్స్ ఎఫెక్ట్ ఈసారి కచ్చితంగా చూపిస్తుంది. పెద్ద ప్రాణానికి ముప్పు కావచ్చు" డాక్టర్ చెప్పిన మాటల్ని ఏ మాత్రం పట్టించుకోలేదు. అసలా విషయం లక్ష్మికి చెప్పనే లేదు. లక్ష్మి పోయినా బిడ్డనిస్తే చాలనుకున్నది సుశీల.

రానే వచ్చింది ఆ రోజు. లక్ష్మిని మూడు రోజులు ముందుగానే హాస్పిటల్‌లో జాయిన్ చేయించింది. తన మనవడ్ని ఎప్పుడా, ఎప్పుడెప్పుడా? చూసేదని ఒళ్ళంతా కళ్ళు చేసుకొని క్షణాల్ని యుగాలుగా గడుపుతోంది. తన ఫ్రెండ్సంతా హాస్పిటల్ కొచ్చేసరికి మరింత ఉక్కిరిబిక్కిరవుతోంది సుశీల.

రాంబాబు సిగరెట్ పీకను కిందపడేసి బూటుకాలేసి నలిపి వార్డు దగ్గరకొచ్చాడు "అమ్మా ఏమయ్యింది?" అడిగాడు. ఇంతలో అప్రయత్నంగానే ఆపరేషన్ థియేటర్లోంచి పసివాడి ఏడుపు కెవ్వున వినిపించింది. రాంబాబు కుర్చీలో కూలబడ్డాడు.

అయిపోయింది అంతా అయిపోయింది. ఇక లక్ష్మి లేదు. మేకను అందంగా అలంకరించి దేవునికి బలిచ్చినట్లు ఈ అందమైన, ఖరీదైన హాస్పిటల్‌లో లక్ష్మిని అలంకరించి సాగనంపాం. కాదు చంపేశాం. లక్ష్మి... చివరిసారిగా నన్ను చూస్తానన్నా కర్కశంగా డాక్టర్లు పిల్వలేదేమో? ఖైదీకి ఉరిశిక్ష అమలు చేసేటప్పుడైనా చివరి కోర్కె తీరుస్తారు. కాని "వీళ్ళు నీ ఆఖరి మాటకైనా జాలిపడి నన్ను రానియ్యలేదు లక్ష్మీ' అవును నేను మాత్రం ఇక్కడెందుకు వస్తున్నా ఆగు లక్ష్మి, భూమ్మీదైనా నీ-నా ఇష్ట ప్రకారం గడపలేదు. అక్కడన్నా గడుపుదాం. నీ భర్తగా ఇక్కడ నిర్వహించలేనివన్నీ అక్కడ నిర్వహిస్తాను. ఆగు లక్ష్మి నేకూడా వస్తున్నా.

రాంబాబు ఆత్మ దేహాన్ని వదిలి చేతులుచాచి పిలుచుకుంటూ పైకెళ్ళి పోతోంది. హాస్పిటల్ మెర్క్యురీ బల్బుల మధ్య ధగధగా మెరిసిపోతోంది. అమ్మ తన మనవడితో మురిసిపోతోంది. గండు చీమ వెనకచిన్న చీమల్లా ఆమె ఫ్రెండ్సంతా బాబుని ముద్దుల్తో ముంచుతున్నారు. రాంబాబు మరికొంత పైకెళ్తున్నాడు. మహిళా సంఘాల ఆఫీసులు స్వేచ్ఛగా గాల్లో విహరిస్తున్నాయ్! రోడ్లపై మహిళలుఒక్కరే, ఏ తోడూ లేకుండానే ఇష్టమొచ్చిన డ్రస్సుల్లో గాంధీ గారన్నట్లు తిరుగుతున్నారు ఎర్రచీమల్లా లైట్ల వెలుగుల్లో.

రాంబాబు లక్ష్మిని కలిశాడు. తన బాధనంతా వెళ్ళగక్కి గోడుగోడున ఏడ్చాడు. అసలు నీవెందుకు మా అమ్మకు ఎదురు తిరగలేదని లక్ష్మిని ప్రశ్నించాడు. "ఇరవై సంవత్సరాలుగా ఆపని నీవెందుకు చేయలేదు" లక్ష్మి ఎదురు ప్రశ్నించింది. రాంబాబు మొహం వాల్చాడు. "అసలు పెద్ద ప్రాణానికే ముప్పని తెలిసిన తర్వాత కూడా ఇలా ఎందుకు చేశావ్? మళ్ళీ ప్రశ్నించాడు రాంబాబు "మాతృత్వం కోసం" లక్ష్మి మారు చెప్పింది.

"మాతృత్వం అంటే ఏమిటి"?

"బిడ్డను కనడం"

అంటే తన నుండి మాంసం ముద్దను వికృతంగా వేరుచేసి చేతుల్లో పట్టుకొని రక్తాలొడుస్తుంటే చూసి ఆనందపడటమా? గట్టిగా ప్రశ్నించాడు రాంబాబు. లక్ష్మి మాట్లాడలేదు. తలనేలకేసింది.

"రెండు పిండాల్ని మెడవట్టి పిసికి చంపేస్తుంటే అప్పుడేమైంది ఈ మాతృత్వం?" లక్ష్మి మారు మాట్లాడలేదు.

అసలు నాకు ఆ విషయాలు ఎందుకు చెప్పలేదు? గట్టిగా లక్ష్మిని పట్టుకొని ఏడ్చాడు రాంబాబు. ఆత్మ సంఘర్షణలో పడ్డాడు. తనను తాను ప్రశ్నించుకున్నాడు. "లక్ష్మి విషయంలో అశ్రద్ధ చేస్తున్నట్లు నేనెందుకు గుర్తించలేదు?

అమ్మ ఆదర్శం, నాన్న స్టేటస్, నా వ్యక్తిగత సుఖ కార్యాల వెనుక ఇంత అగాధం ఉందని ఏనాడూ గుర్తించలేదు. అమ్మ, నాన్న, ఆ మాటలు రాంబాబు చెవుల్లో వింత వింత రోత రోతగా విన్పిస్తున్నాయి. తనపై తనకే అసహ్యం వేస్తోంది. ఆదర్శాలు చెప్పడానికేనా? ఆచరించే వారెవరు? ప్రశ్నలు రాంబాబును చుట్టుముట్టాయి. ఒక్కో ప్రశ్న ఒక్కో జీవితం ఛేదించలేని విషవలయంలో కూరుకుపోయాడు. లక్ష్మి తనను విడిచి వెళ్తుందనే ఊహకు రాగానే గట్టిగా గొంతుచించుకొని పిలిచాడు 'లక్ష్మి"....

ఒక్కసారిగా రాంబాబు పిలుపుకు హాస్పిటల్ అంతా ధ్వనించింది. వార్డులో వాళ్ళంతా అయోమయంగా చూస్తున్నారు. ఏమయిందిరా? సుశీల కంగారుగా ప్రశ్నించింది. రాంబాబు ఉలిక్కిపడి లేచాడు. అంటే నే చావలేదన్నమాట! మరైతే ల... లక్ష్మి కూడా బ్రతికి ఉంటుంది. ఆపరేషన్ రూంవైపు పరుగుతీశాడు. తలుపు తీయగానే...పొత్తిళ్ళలో పసిబిడ్డ గుప్పిళ్ళుమూసి కన్పించాడు. పక్కనే మగతగా పడుకొని వున్న లక్ష్మిలలో మృత్యువును జయించిన మాతృత్వం కన్పించింది రాంబాబుకి.

★

నిర్మల ఉదయం-మదర్ హృదయం

మానవత్వానికి అసలు సిసలైన చిరునామా మదర్ థెరెసా. ఏ ప్రమాణాల రీత్యా చూసినా ఆమె చేసిన సేవలు అసమానమైనవి. అనాధలు, రోగులు ఇలా ప్రతి ఒక్కరినీ తన ఒడిలోకి వారికి సేవలందించారు. నిస్వార్థంగా సేవ ఆమెకు వెంటనే సహకరించలేదు. ఎన్నో ప్రచారకురాలు అని, ప్రజలను క్రైస్తవులుగా పాఠశాల, కుష్ఠు చికిత్సా కేంద్రం, మరేదైనా వెళ్ళగొట్టేందుకు ప్రయత్నించారు. అయితే 'నిస్వార్థంగా తన పని తాను కార్యదక్షతను చూసి ఎంతోమంది కరిగించుకున్నారు. యుగోస్లేవియాలో ఎలా అయ్యారో స్థూలంగా వివరిస్తుందీ కన్నా ఆమె స్థాపించిన సేవాకేంద్రాలు ఎలా ఎదుర్కొన్న ఇబ్బందులు ఏమిటన్న సహజంగా మదర్ తన గురించి తాను ఓ చోట పేర్కొన్నారు కూడా. జరుగుతున్న అనేవారట. 23 సంవత్సరాల పాటు మదర్ చావ్లా ఈ పుస్తకాన్ని ఇంగ్లీషులో రాయగా నవీన్‌చావ్లా ఓ ఐఏఎస్ అధికారి. తన

మదర్ థెరెసా
వెల : రూ.80/- రచన : నవీన్ చావ్లా, **తెలుగు** : ఆర్వీయార్, **ప్రచురణ** : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, **ప్రతులకు** : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

రోగపీడితులు, అంగవికలురు, మానసిక చేరదీశారు. తన అమృత హస్తాలతో చేసేందుకు ఆమె సంకల్పించినా సమాజం కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. మత మార్పుతోందన్న అపవాదునూ మోశారు. మిషనరీ స్థాపిస్తే అక్కడి నుండి ఆమెను వారందరికీ మదర్ చెప్పిన జవాబు చేసుకుపోవడమే'. ఆమె అంకితభావం, రాయిలాంటి తమ గుండెను పుట్టిన ఓ బాలిక ప్రపంచానికే మదర్ పుస్తకం. మదర్ థెరెసా వ్యక్తిగత జీవితం అభివృద్ధి చెందిందీ, అక్కడ వారు విషయాలు ఈ పుస్తకంలో ఎక్కువ. చెప్పుకోవడానికి ఇష్టపడలేదని రచయిత కృషిని చూసి రాయండి అని ఆమె థెరెసాతో సన్నిహితంగా మెలిగిన నవీన్ తెలుగు అనువాదం ఆర్వీయార్ చేశారు. బాధ్యతలు నిర్వహిస్తూనే వీలయినంత ఎక్కువ సమయం మదర్ కార్యకలాపాలను, మిషనరీలు పనిచేసే తీరును గమనించడానికి ఆయన పూనుకున్నారు. 14 భాషల్లోకి అనువదించిన ఈ పుస్తకాన్ని మదర్ స్వయంగా చదివి రచయితను అభినందించడం ఓ విశేషం. అనువాదం బాగుంది. రచయిత మదర్‌తో మాట్లాడిన సంభాషణను, 1991లో జార్జి బుష్, సద్దాం హుస్సేన్‌లకు మదర్ రాసిన లేఖను అనుబంధంగా అందించారు. పుస్తకం మధ్యలో ప్రచురించిన ఛాయాచిత్రాలు మదర్‌తో పాటు ఇతర సేవా కార్యకర్తలు పేదల పట్ల ఎంతటి ప్రేమ, కరుణను కలిగి ఉంటారో పట్టి చూపిస్తాయి.

-కె.కె.

వస్తువైవిధ్యం 'వర్ణనిశి'



వర్ణనిశి
రచన : చిల్లర భవానీదేవి
వెల : రూ.40/-
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, నవోదయ బుక్‌హౌస్, దిశపుస్తక కేంద్రం, హైదరాబాద్

వస్తువైవిధ్యం నూత్న అభివ్యక్తికి హేతువు అవుతుంది. వస్తువు కొత్తదైనా అభివ్యక్తిలో కొత్తదనం లేకపోతే ఎక్కడో లోపం జరిగిందన్నమాటే. తెచ్చిపెట్టుకున్న ఆవేశం అంతకుముందే సిద్ధంగా వున్న పాత పదాలతో, పాత వ్యక్తీకరణ రీతిలోనే కవిత్వాన్ని సృష్టిస్తుంది. ఇది కవిని దెబ్బతీస్తుంది.

'వర్ణనిశి'లో చిల్లర భవానీ దేవికి ఎదురైన అనుభవం. ఆమెకు వస్తువుకు తగిన వ్యక్తీకరణ సామాగ్రి సరిపోలేదు. ఆమె భాషలో చెప్పాలంటే పాత కవితా భాషను దాటి ముందుకెళ్లలేకపోయారు. దీంతో భవానీదేవి గారు భాష చాలక పాతపదాలతోనే బాధపడాల్సొచ్చింది. బరువు పదాల మధ్య తాను చెప్పదల్చుకున్న దానిని సరిగా చెప్పలేకపోయారు.

కవిత్వం పండించటంలో అనుభవం వున్నవారు సమకాలీన సమస్యలపై స్పందించారు. ప్రపంచీకరణ ప్రభావాన్నీ, వ్యవసాయరంగ దుస్థితిని 'టెర్మినేటర్' ద్వారా చిత్రించారు. ఇది కొత్త వస్తువు. 'ఒక సౌందర్య దుఃఖగీతం'లో 'సౌందర్య వేటగాళ్ల'ను విమర్శిస్తారు. చాలా చోట్ల తీవ్రమైన ఆవేశం కనబడుతుంది. దాన్ని అదుపు చేసుకొనే క్రమంలో కవి ఎక్కడో జారిపోతారు. ధైర్యం కొంత నష్టాన్ని చేసిందని చెప్పొచ్చు. సుదీర్ఘ కవితలు శిల్పపరంగా, టెక్నిక్కు పరంగా బలహీన పడ్డాయి. కొన్నిసార్లు కవి గందరగోళంలో పడే స్థితి వస్తుంది. "సమరస్ఫూర్తి' కవితలో జరిగిందిదే. మంచి 'ఎత్తుగడ'తో ప్రారంభమైన కవిత ముగింపుకు ముందే జీవాన్ని కోల్పోయింది. సూటిదనం నుంచి వ్యంగ్యానికి మారటంతో కవి కష్టాన్నెదుర్కోవాల్సి వచ్చింది. కొంత జాగ్రత్త తీసుకొంటే ఇంకా గొప్ప కవితలొచ్చేవి.

- జిలుకర శ్రీనివాస్

స్వీకారం



మార్క్సిస్టు తత్వశాస్త్ర మూలసూత్రాలను ఆ సిద్ధాంత కర్తల రచనల నుంచే అందించే సిరీస్ ఇది. హవార్డ్ సెల్సం, హారీ మార్టెల్‌ల సంపాదకత్వంలో వెలువడిన "రీడర్ ఇన్ మార్క్సిస్ట్ ఫిలాసఫీ'' అనే పుస్తకాన్ని కొన్ని భాగాలుగా ముద్రించాలని ప్రజాశక్తి బుక్‌హౌస్ నిర్ణయించింది. అందులో ఇది మూడవది. ఇవి వేటికవే సమగ్రంగా వుంటాయి. సోవియట్ విచ్ఛిన్నం, సోషలిస్టు శిబిరానికి ఎదురుదెబ్బ తర్వాత మరింత ప్రాధాన్యత సంతరించుకున్న సిద్ధాంత అధ్యయనానికి ఈ ప్రచురణ దోహదపడగలదు. పై గ్రంథం న్యూయార్క్ ఇంటర్నేషనల్ పబ్లిషర్స్ ప్రచురణగా 1963లో తొలిసారి వెలువడింది. 1987లో వచ్చిన 12వ ముద్రణకు అనువాదమిది.

గతితర్కం - గతి తార్కిక పద్ధతి
తెలుగు : ఎ.గాంధీ; వెల : రూ. 12/-,
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

ఈ గ్రంథం చరిత్ర విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, చరిత్రను గురించి సశాస్త్రీయంగా అధ్యయనం చేయదల చుకున్న వారికి ఎంతో ఉపయుక్తంగా వుంటుంది.

ప్రాచీన భారతదేశ చరిత్ర
ఆంగ్లమూలం : రామ్‌శరణ్ శర్మ, **తెలుగుసేత** : వల్లంపాటి వెంకటసుబ్బయ్య, **వెల** : రూ. 90/-, **ప్రతులకు** : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



మనోవికాసం
రచన : హిప్నో కమలాకర్,
వెల : రూ. 30/-,
ప్రతులకు : జె.పి. పబ్లికేషన్స్, గాంధీనగర్, విజయవాడ.